**శారీరకశ్రమ అనాగరికతకు చిహ్నంగా మారటమంత విషాదం మరొకటుండదు. వ్యవసాయదారునికి పిల్లనివ్వటం నేరంగా పరిగణించేటంత దౌర్భాగ్యం ఇంకొకటి వుండదు. యీ సమస్య కరువు ప్రాంతమైన మా పల్లెలదే అనుకొన్నాను. కాని తర్వాత యిది సేద్దెం చేసుకు బతికే యువతరమంతా ఎదుర్కొంటోన్న అన్ని ప్రాంతాల సమస్య అని అర్థమయిది. అంతరించి పోతోన్న సేద్దెగాళ్ల జాతిని గురించిన ఆవేదనే యీ కథ.**

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

# 13

# సేద్దెగాడు

పి.యస్. చారి





రాత్రి భోజనాల తర్వాత చేయి తుడుచుకొంటూ వీధిలోకి నడిచాను. ఆకాశం నిండా వానమోడాలు కమ్ముకొని ఉన్నాయి.

ఎదురుగా వేపచెట్టు కింద అరుగు నిండా జనాలు కూచుని యవ్వారాలు చేస్తున్నారు.

పడమటి గాలుల పోడుకు చెట్లకొమ్మలు అల్లల్లాడుతున్నాయి.

మృగశిర దాటి ఆర్ద్రకార్తె వచ్చింది. సన్న సన్న తుంపర్లు రాలుతూ ముంగిళ్లు చల్లబడ్డాయి. గాని ఒక్క పదును వాన కూడా కురవలేదు. బీళ్లు పచ్చబడలేదు. ఎండిన గడ్డిపాదులు చిగురించి బర్రెగడ్డికి ఎదగటం మాట అటుచి గొర్రెగడ్డిగా కూడా మారలేదు.

రెండేళ్ల నుంచి కరువు తాండవిస్తూ ఉంది. ఈ యేడు సకాలంలో వానలు కురుస్తాయనీ, చెరువులన్నీ నిండి అలుగులెత్తుతాయనీ వాతావరణ శాస్త్రజ్ఞుల నుంచి సిద్ధాంతుల దాకా అందరూ నమ్మకంగా చెబుతున్నారు.

నేల దప్పిగొని ఉంది. అంతులేని దాహంతో అలమటిస్తూ ఉంది. ఇప్పుడొక పెద్ద వాన కావాలి. వంకలు వాగులు పొంగి, చెరువులు దొరువులు నిండి, భూగర్భజలాలు పెరిగే వాన.

ఆ విషయాలే మాట్లాడుకొంటున్నారు అరుగు మీద కూచున్న వాళ్లు. పాలెండిన బర్రెల్ని చాలావరకు అమ్మేసుకొన్నారు. అవన్నీ దాదాపుగా కటిక అంగళ్లకే పోతున్నాయని అందరికీ తెలుసు. అయినా తప్పని పరిస్థితి. ఎవరి కళ్లాల్లో కూడా పిడికెడు ఎండుగడ్డి పోచల్లేవు. గొల్లలు గొర్ల మందల్ని బతికించుకునేందుకు నల్లమల కొండలకు తోలుకెళ్లారు.

ఒకప్పుడు ఇంటికొక కాడి ఉండేది. ఎద్దులగాళ్లు ఇంట్లో భాగమై ఉండేవి.

"వంద కాండ్లున్న ఊర్లో ఇప్పుడు ఎద్దనేది లేకపాయె..." బాధగా అన్నాడు సుబ్బన్న.

"వాటిని సాకి సగదీసేదెవుడు? వాటెనక పగులంతా దుక్కి పెల్లల్లో నడిచే మొగోడుండాడా ఇప్పుడు?" గురయ్య ప్రశ్న.

"అదో... మా ఓబులేసుగాడు ఒక్కడు తప్ప..." అంటూ దుబ్బెంగటన్న సవరించాడు. "ఈ కాలానికి మావోడొక్కడేనబ్బా మొగోడు. కాడెద్దులు బెట్టి సేద్దెం జేస్చాండాడంటే పోతుపాలెగాని కిందే లెక్క...'

"ఎంత పాలెగాడయితే ఏమి- పిల్లనిస్చానని వచ్చే దిక్కే లేకపాయె... తిరిగి తిరిగి కాల్లరిగిపాయె నర్సన్నకయితే..." సుబ్బన్న సానుభూతిగా అన్నాడు.

"ఆ చింతా తీరిందిలేవోయ్ ఈ గురమామ పున్నేన..." దుబ్బెంగటన్న అన్నాడు.

"ఎట్లా?..." లేచి దగ్గరగా వచ్చాడు మేకలోల్ల మునెయ్య.

"పెండ్లి కుదిరిన్లే..."

"ఏ ఊరికాడ?"

"మామిల్లపల్లె కాడ..."

ఆ విషయం నాగ్గూడా ఈరోజు సాయంత్రమే తెలిసింది. నర్సయ్య వచ్చి చెప్పాడు. దసరా ముహూర్తాల్లో పెళ్లి ఖాయం చేస్తారట.

"వానికేం... పిల్లోడు బాగుండాడు గదా! ఏదో... కాలం కలిసిరాక ఆలస్యమైంది గాని..." అన్నాను.

"బాగొక్కటేనా... ఎంత మంచి పనిమంతుడనీ! పొలమూ ఇండ్లూ దప్ప ఏమన్నా ఎరుగునా? ఎంత మంచి సేద్దెగాడనీ! పైరుపంటలు తప్ప యింగొకటి రుచెరుగునా? నాగేలి కోంద్ర జేస్చే అదేపనిగా నిలబడి సూడబుద్ధయిద్దే ఎవురికైనా! ఈ రోజుగ్గూడా ఎద్దల సేద్దెం యిడ్సలేదంటే ఎంత ఓపికున్న సేద్దెగాడో సూడండి..." దుబ్బెంగటన్న అన్నాడు, గొంతులో కొంత గర్వం రెపరెపలాడుతోండగా. ఓబులేసు అతని తమ్ముని కొడుకే.

వెంటనే గురయ్య అందుకొన్నాడు. "ఏరా నాయనా! ఆ మాట అనగాకురా..." అన్నాడు లోగొంతుకతో. "సేద్దెగాడని గట్టిగా అనేవు, పిల్లనిచ్చే వాల్లకు తెలుస్చే ఎగరగొడ్తారు..."

ఉలికిపాటుగా చూశాను అటుకేసి.

చెతురుగా అంటున్నాడో నిజంగానే పలుకుతున్నాడో అర్థంగాలేదు నాకు.

"ఏంది గురమామా అట్టంటావు?" దుబ్బెంగటన్న నొచ్చుకొన్నాడు. "పనిమంతుడు మామా మావోడు..."

"మల్లా అదే మాటంటావు బుద్ధిలేకండా..." లోగొంతుకతో అరిచాడు గురయ్య. "సెబుతే అర్థంగాదు నీకు. తెలివిలేన్నాయాలివి. సేద్దెగాడని తెలిస్తే ఖాయం గా పిల్లనెగరగొడ్తారు. నువు జెప్పేంత యావున్న సేద్దెగానికి ఎవరూ పిల్లనియ్యరు..." అంటూ అరుగు మీంచి లేచాడు.

నాకైతే నోట మాట రాలేదు.

కదిలిపోతూ ఉన్న గురయ్యకేసి తదేకంగా చూస్తుండిపోయాను.

'సేద్యగాడని కాకుండా ఏమని చెప్పి ఉంటారు ఓబులేసు గురించి?'

❖

సాయంత్రం మా కుంటలకేసి నడుస్తూ ఉన్నాను.

కాలేజీ నుంచి ఇళ్లకొచ్చిన పిల్లలు పుస్తకాల్ని గూట్లో పడేసి సైకిల్ తీసుకొని పొలం దగ్గరకెళ్లి విరిచిపెట్టి ఉన్న ఎండుపుల్లల్నో, కోసి మోపుట్టి ఉన్న పచ్చిగడ్డినో వెనక కట్టుకొని జమాయించి తొక్కుతూ రోడ్డుమీద ఎదురవుతున్నారు. కొందరు ఆడపిల్లలయితే తల్లులకు ఎదురెళ్లి గడ్డిమోపుల్ని తమ తలలకు మార్చుకొని... పిచ్చిబరువు ముందుకు తోస్తూ ఉంటే పరుగెత్తినట్టుగా ఇంటికేసి నడుస్తున్నారు.

పైరు మాట ఏమోగాని దుప్పటంత నేలలో పెంచుకొంటున్న పచ్చిగడ్డిని మాత్రం బతికిస్తున్నాయి బోరుబావులు.

జ్యోతివాగు వంకలోకి దిగి గట్టెక్కబోయేసరికి రెండు పొట్టేలు పిల్లల్ని వెంటేసుకొని వస్తూ ఎదురయ్యాడు గురయ్య. మెడమీదకు చెంగు విడిచి తలగుడ్డ చుట్టి ఉన్నాడు. చేతిలో పచ్చివాయిల మెల్లె ఉంది.

''కుంటకాడికా రెడ్డే!'' అడిగాడు.

''అవున్నా,'' చెప్పాను. ''అదిసరేగాని రాత్రి యేందన్నా అంత లావు మాటం టివి? సేద్దెగానికి పిల్లనిచ్చేవాడే లేడా?'' గొంతులో పట్టనంతగా మల్లేడుతూ ఉన్న ఆశ్చర్యాన్ని ప్రశ్నగా మారుస్తూ అడిగాను.

''నిజమే!'' చెప్పాడు గురయ్య. ఎన్ని ఊళ్లు తిరిగుంటా... ఎన్ని పెండ్లి పెత్తనాలు జేసింటా... ఏడీ... సేద్దెగానికి పిల్లనిచ్చేటోడు యాడుండాడు? ప్రతోడూ ఉద్దేగస్తున్నో యాపారాస్తున్నో సూస్తాండుగాని ఎద్దు ముడ్డి పొడ్సుకునే వాడంటే కండ్లెత్తి కూడా సూడ్డంలే... ఎన్ని అబద్ధపు కూతలు కుయ్యాల సేద్దెగానికి పిల్లను కుదర్సాలంటే! కూలోల్లతో పన్చేయించికొంటాడనో, ఆడమనుసులకి ఇంట్లో పన్దప్ప బైటికి అడుగుబెట్టేది లేదనో, కూలోల్లకు సంగటి కూడా సేనికాన్నే పొయ్యిబెట్టి గెలికిస్చాడనో, మోటార్సైకిల్లో తిరుగుతాడనో, అరసేయంత సెల్లు పట్టుకోనుంటా డనో, ఎన్ని అబద్ధాలోలే... ఆ రొంత తంతు ముగిసినాక ఎన్ని తిట్లు దింటామో మాకే ఎరుక...''

''అట్లా అబద్దాలాడ్డం తప్పుగదన్నా!''

"వాల్ల ఆశ గూడా తప్పేలే రెడ్డీ!" అన్నాడు గురయ్య. "ఆ పిల్లకేమన్నా సదువు జెప్పించింటారా? లే... సెల్లు ఎట్ల వాడేదన్నా నేర్పించింటారా?... లే... మోటర్‌సైకిల్ ఎనక ఎట్ల ఎక్కేదన్నా అలబాటు సేసింటారా? లే... పెండ్లయ్యేదాకా గొడ్డులా పన్జే యించుకొని పెండ్లయినాన్నుంచి కూతురు సుగంగా ఉండాలనుకొంటారు. రైతు పనిలో బాగా నలిగిన పిల్లను రైతులిండ్లకు యియ్యరు. కాలమెట్టొచ్చెనో సూడు. మేం తప్పు జెయ్యడంలే... మిరపనారును మెట్ట నేలల్లో నాటి దోసెడు నీల్లు పోసి బతికించాలని సూస్తాండం. బురద మల్లల్లో నాటి దాని పానం తియ్యాలనుకోవడం లే..."

ఆయనకేసి అబ్బురంగా చూశాను.

"ఇంతజేసీ పెండ్లి కుదిర్సినామా- యింగొడెవుడో వొచ్చి పది తులాలు బంగారు సొమ్ములు పెట్టుకొంటామనో అదనో యిదనో ఆ పిల్లను ఎగరదన్నుకొని పోతారు. అట్టయిగాదూ ఐదారేండ్ల నుంచి ఎంత ఎతుకులాడ్తాన్నే ఓబులేసుకు పిల్ల దొరకంది... నర్సిగానికి ఏడుపొకటె తక్కువనుకో- కొడుక్కు పెండ్లయిద్దా కాదా అని. కడాకు ఖాయం జేసినాం... ఏమయిద్దో ఏమో సూడాల..." చెబుతూ పొట్టేలు పిల్లల వెనక కదిలాడు గురయ్య.

ఆయన చెప్పిన విషయాలన్నీ దృశ్యాలుగా మారి నా కళ్లముందు కదలాడుతున్నాయి.

సేద్దెగానికి పెళ్లిగావాలంటే ఇన్ని అబద్ధాలాడాలా? ఇంత లావు అగచాట్లు పడాలా?

కుంటలు నిండి అలుగులు పారాల్సిన కాలం ఇది. కుంట గర్భమంతా నెర్రెలు కొట్టి ఉంది. పొదలన్నీ పచ్చగడ్డితో నిండి లోపల పందులు దాగున్నాయో, కుందేళ్లు నక్కి ఉన్నాయో తెలీని పరిస్థితిలో ఉండాల్సింది. కాని పండి ఎండిన గడ్డి నేల వాలటం వల్ల, మేకల్లాంటి జీవాలు అటు ఇటు దారులు చేయటం వల్ల పొదలు పలుచబడి, వాటి మధ్యలోని చెట్ల మొదళ్లు స్పష్టంగా కన్పిస్తూ రహస్యం లేకుండా ఉన్నాయి.

కుంటకింది పొలాల్లో పత్తి నాటి ఉన్నాడు ఓబులేసు. పైరు బావుందిగాని బోరులో నీళ్లెండిపోవస్తున్నాయి. ఎలాగో అవస్థలు పడుతున్నాడు. మోటారు వద్ద కన్ను కూరకుండా కాపలా కాసి ఒక్క నిమిషం కరెంటు వృధా పోకుండా మోటారు ఆడించి వచ్చే చారెడు నీళ్లతోనే తడి అందించగలగటం వల్ల పైరు వాడిపోకుండా కాపాడగలుగుతున్నాడు. కరెంటు వచ్చింది తెలుసుకొని ఇంటి వద్ద నుంచి ఉరుకులు పరుగుల మీదొచ్చి మోటారు ఆడించేవాడయి ఉంటే పైరెప్పుడో ఎండిపోయి ఉండేది. ఓబులేసు అట్లా కాదు- ఎప్పుడూ చేలవద్దే ఉంటాడు.

అదే వాడి పెళ్లికిప్పుడు అవరోధంగా మారింది.

పొద్దుగుంకి చీకటి పడుతుండటంతో కుంటలోని తుమ్మచెట్ల కొమ్మల్నిండా పావురాళ్లు, బెళ్లగోళ్లు, ఇంకా రకరకాల పక్షులు వింత వింత గొంతుకలతో సందెవేళకు ప్రాణం పోస్తున్నాయి. ప్రతి సాయంత్రం ఇక్కడకు వచ్చి ఈ పక్షుల, మొక్కల ప్రపంచం లో కలిసిపోయి తన్మయుణ్ణవటం నాకు అలవాటుగా మారింది.

చీకటి పూర్తిగా అలముకొన్న తర్వాత ఇంటిదారి పట్టాను.

అందరి యువకుల్లాగా నాగరికతను అందుకోవటంలో ఓబులేసు బాగా వెనకబడి ఉన్నాడనే విషయం రెండు మూడు పెళ్లి సంబంధాలు తప్పిపోయిన తర్వాత వాళ్లు వీళ్లు ఎత్తి పొడవటం వల్లగానీ నర్సయ్యకు తెలిసిరాలేదు. 'పొలమూ ఇల్లూ తప్ప లోకం తెలవకుండా పెంచినా. తప్పు నాదేనేమో,' అంటూ బాధపడ్డాడు.

'మోటార్‌సైకిల్ కూడా లేకుండా పిల్లనెవుడిస్తాడు!' అని ఎవరో అన్నారని నావద్దకొచ్చాడు ఏడాది క్రితం. ''మీ ఉద్దేగస్తులది ఎవురిదెన్నా ఉంటే సూడు దొరా! పెద్దగా నలగకుండా రోంత సలీసుగా వచ్చే బండి సూసి ఇప్పీ...'' అని అడిగాడు.

మోటార్‌బైకు సమకూరింది.

ఇంకో పెళ్లి తప్పిపోయిన తర్వాత సెల్‌ఫోన్ లేని సంగతి ఎత్తిపొడిచారని, ''ఏమన్నాగాని ఒక సెల్లు కొనీ దొరా!'' అంటూ వచ్చాడు.

ఒక్కో సంబంధం తప్పిపోయినప్పుడల్లా నాగరికతకు చిహ్నాలుగా భావించే వస్తువులు ఒక్కోటీ అమరుతున్నాయి ఓబులేసు ఒంటి మీదా, ఇంటి లోపలా.

అయినా ఒకనాడు గొణుక్కొంటూ వచ్చాడు నర్సయ్య. ''అదేదో టీ... టీ సొక్కానా... ఆ... టీ సొక్కే... అది తొడుక్కొని టౌజరేసుకుని సెల్లు జేబులోపెట్టుకొని మోటార్‌సైకిల్లో సుట్టాలింటికి పోయి ఒక్క పూటన్నా ఉండి రమ్మను దొరా! అక్క కాడికో, మేనత్తకాడికో, అవ్వ ఊరికో పోయి రమ్మను. సుట్టాల్ను సూసినట్టుంటది... తిరిగినట్టుంటది...'' అంటూ బతిమాలాడు.

నేను ఓబులేసును పిల్చి హితబోధ చేశాను.

ఇంతగా ఎగదోసి చుట్టాలింటికి పంపినా మధ్యాహ్నానికే తిరిగి వచ్చేస్తాడు. అక్కడో పూట ఉండి, నలుగురి కళ్లబడి, తను నాగరికునిగా మారిన విషయం వాళ్లు గ్రహించేలా ప్రవర్తించడు.

ఊరికి వచ్చేటప్పుడు పొలం వద్దే ఆగి ప్యాంటు, షర్టు విప్పి బైకు మీద పడేసి, టవల్ చుట్టుకుని పొలంపని చేసిన తర్వాతే ఇంటి దారి పడతాడు.

ఓసారి అతన్ని చూట్టానికి వచ్చిన అమ్మాయి తరఫు మనుషులు పొలం వద్దే అతని వేషాన్ని చూసి అట్నించటే వెళ్లిపోయారట. నర్సయ్య నా వద్దకొచ్చి తల పట్టుక్కూచుని విషయమంతా చెప్పి వాపోయాడు.

నర్సయ్యది అచ్చమైన రైతు కుటుంబం. పొలము, పైరే వాళ్లకు సమస్త లోకం. ఇంటి పట్టున ఒక్క నిమిషం కూడా ఉండేది లేదు. బర్రెల్ని, ఎద్దుల్ని, వెంట మేపుకునే తగరు పొట్టేళ్లనూ తోలుకొని అందరూ పొలం వద్దకెళ్లి సాయంత్రం దాకా అక్కడే పనిచేస్తూ గడుపుతారు. కూలీల మీద ఆధారపడకుండా ఎంత పనైనా ఓపిగ్గా చేసుకుంటారు. కరెంటు మోటారు వద్ద తెల్లార్లూ మేలుకొని అయినా మడవ కడతారు. మా ఊర్లో చాలామంది రైతులు కూడా ఇలాగే కష్టపడుతుంటారు గాని నర్సయ్య కుటుంబమంత అంకితభావం కలిగిన రైతులు అరుదు. ఈ కష్టం చూసే మా ఊరి యువకులకు పిల్లనివ్వాలంటే వేరే ఊరివాళ్లు సంకోచిస్తారు. వీళ్ల పనిని చూసి ఏ ఆడపిల్ల తండ్రికయినా భయమేస్తుంది. అంతేకాదు, ఒంట్లో పిడికెడు కండ కూడా లేకుండా ఎప్పుడూ ఉరుకులు పరుగుల మీద నడిచే మా ఊరి ఆడవాళ్లను చూసి భవిష్యత్తులో తమ కూతుర్ల ఆకారాన్ని ఊహించుకొని ఊరికొక దండం పెట్టి వెళ్లిపోతారు.

ఏదేమైనా ఓబులేసుకు పెళ్లి కుదరటం నాకైతే చాలా సంతోషంగా ఉంది. నర్సయ్యయితే మహా ఆనందపడుతున్నాడు. అతని మాటల్లోనే చెప్పాలంటే 'బో కుశాలగా' ఉన్నాడు. రోజూ ఓసారన్నా వచ్చి పెళ్లి ఎలా చేయాలో నాతో చర్చించి పోతున్నాడు.

రెండ్రోజుల తర్వాత రాత్రి అన్నాల వేళకు ముందే వీధెంట ఎవరివో అరుపులు వినిపించాయి. దగ్గరకొచ్చేసరికి నర్సయ్య గొంతులా అన్పించింది.

అతని భార్య గొంతు కూడా తోడయినట్టుంది.

నేను లేచి పంచలోకి నడిచేసరికే మా ఇల్లు దాటి ఎగువీధి కేసి రవరవ నడిచి పోతున్నారు. ఎవరి మీదో కేకలేస్తున్నారు, తిడుతున్నారు. 'కాల్లుసేతులు యిర్సి మంచంలో కూలేస్తేగాని మర్యాదగా ఉండ'డని అరుస్తున్నారు. 'ఏం పని ఈ నా కొడుక్కు? అదేపనిగా పోయి సెప్పె మా కండ్ల దుమ్ముగొట్టె...' అంటూ వీధి మలుపు తిరిగారు.

నాకేమీ అర్థంకాలేదు.

అప్పటికే గుంపులు గుంపులుగా వీధుల్లోకి వస్తున్న జనాన్ని అడిగాను.

వాళ్లకూ తెలీదట.

కొంతసేపటికే పై వీధిని 'గూ...బే...' అని అరుపులు.

ఆడా మగా జనాలంతా అటుకేసి పరుగెత్తారు.

నేను కూడా దేవాలయం మలుపుదాకా వెళ్లాను.

ఎగువీధిన మోపురోళ్ల ఇంటికాడ దుబ్బెంగటన్న పైనబడి దబాగుబా పిడి గుద్దులు గుద్దాడుట నర్సయ్య. జనాలు నర్సయ్యను పక్కకు లాగారుట.

'ఆడపిల్ల గల్లోల్లకు ఏమేమో జెప్పి పిల్లనియ్యకుండా జేసి తమ కొంప కూల్చా డనీ, తమ ఉసురుగొట్టుకొని చస్తాడనీ,' ఆలుమగలిద్దరూ దుబ్బెంగటన్నను నోటి కొచ్చినట్టు తిట్టి వెనుదిరిగారట.

వీధెంట కూడా తిట్టుకొంటూనే వెళ్లారు.

అసలు విషయం ఏమిటంటే- పెళ్లికూతురు సంబంధీకులు ఎక్కడో ఎదురుపడితే, ఓబులేసు పనితనాన్ని గురించీ, సేద్యగానితనాన్ని గురించీ వొగిరించి వొగిరించి చెప్పాడుట దుబ్బెంగటన్న. వాడి గొర్రు తోలే పనితనాన్ని గురించీ, నిమిషం కూడా ఊరకుండకుండా పొలం పనులు చేసే ఓపికదనాన్ని గురించీ గొప్పగా చెప్పాడుట. ఇంకా ఈనాటికీ ఎద్దులతో వ్యవసాయం చేసే తన తమ్ముడి కొడుకు రైతుదనాన్ని గురించి ఆకాశమంత ఎత్తు పొగిడి మీసాలు దువ్వుకొన్నాడుట. దాంతో వాళ్లు భయపడిపోయి సంబంధాన్ని వదులుకొంటున్నట్టు కబురు పంపారుట.

అందుకే కోపాన్ని తట్టుకోలేక అన్న మీద దాడిజేసి వెళ్లాడు నర్సయ్య.

తమ్ముని చేత దెబ్బలు తిని ఏడ్చుకొంటూ మా ఇంటి ముందు అరుగు మీదకొచ్చి కూచున్నాడు దుబ్బెంగటన్న.

"నేనేం జెప్పినా! పిల్లోడు తాగుబోతో, తిరుగుబోతో, సెడ్డనాకొడుకో అని సెప్పిన్నా? మంచి సేద్దెగాడని జెప్పినా. అదీ తప్పేనా? మావోడు గొర్రు తోలితే ఈనె జీల్చినట్టు సాల్లు కనబడ్తాయని సెప్పినా. అయవారు రూళ్లకట్టెతో గీతలు గీసినట్టుం టాయని సెప్పినా. పనిమంతుడని సెప్పినా... అదీ తప్పేనా? సూడు... గొడ్డును బాది నట్టు ఎట్ట బాదిండో..." అంటూ అక్కడున్న నారాయణకు వీపు చూపించి ఏడ్చాడు.

అప్పుడే అటుగా వచ్చిన గురయ్య అన్నాడు, "మొన్ననే జెప్పినా నీకు- ఆ మాట అనగాకురా నాయాలా అని. యిన్నేవా?"

"నేనేం తప్పన్నె మామా? ఎద్దుల్ను కన్నకొడుకుల్ని సూసుకున్నెట్టు సూసు కుంటాడని, ఆన్నే చేలు పైరు దప్ప వానికి ఏ లోకమూ పట్టదని అన్నే. అదీ తప్పేనా?" గొంతు జీరబోయింది దుబ్బెంగటన్నకు.

"అంతకన్నా తప్పుడు కూతలుండాయా ఈ కాలంలో?" అరిచినట్లుగా అన్నాడు గురయ్య. "అట్ల జెబుతే పిల్లనిచ్చేదెవుడు? ఏం... నోర్మూసుకుని మర్యాదగా కూకోనుండలేవా? నీ నోటి జిల ఆ పిల్లోని పెండ్లి జెడగొట్టె... ఆ కూతో ఈ కూతో కూసి పెండ్లి కుదిర్సిన మేమంతా తప్పుడునాయాండ్లమైతిమి."

"ఎంత పాపిష్ఠి కాలమొచ్చె దేవుడా!" రెండు చేతులు మోడ్చి పైకెత్తి ఊపుతూ అన్నాడు దుబ్బెంగటన్న. "లోగడ నన్ను కాడికి బొమ్మంటే సపిస్చే పోకపోతిని. ఎద్దుల్ను సూస్చే సాలు దూరదూరంగుంటి. అయితే నాట్లూ కలుపులూ తవ్వకాలూ కోతలూ ఆడోల్ల కంటే పనితనంగా సేస్చాంటి. ఆ రోజుల్లో నేను సేద్దెగాన్ని కాదని నాకు పిల్ల నిచ్చేటోడు లేకపాయె. ఇప్పుడు మా ఓబులేసుగాడు మంచి సేద్దెగాడని సెబుతే వానిగ్గాడ పిల్లనిచ్చేటోడు దొరక్కపాయె... కాలమెంత మారిపోయెరా దేవుడా!" అరుగు మీద కూర్చుని ఏడుపు గొంతుతో దీర్ఘాలు తీస్తున్నాడు.

అక్కడున్న వాళ్లందరి కళ్లూ చెమర్చాయి.

"విచిత్రమైన కాలమే..." గురయ్య అన్నాడు.

"బండి మీద నాలుగు కూరగాయలు పెట్టుకొని అమ్ముకొనే వానికయినా పిల్లనిస్చాండరు. గుడ్డలమూట సైకిల్ మీద కట్టుకొని ఊరూరా దిరిగే వానికయినా, యిండ్లిండ్లూ దిరిగి పాలు పోయించుకొని టౌన్లో అమ్ముకొనే వానికయినా, పూలో పండ్లో సెనక్కాయలో దోసిత్తనాలో కడాకు సెరుగ్గడెలు అమ్ముకొనే వానికయినా సరే- పెండ్లాన్ని గడపమాను దాటనీకుండా సాకుతాడని పిల్లనిస్చాండరుగాని- అవన్నీ పండించే రైతు, తనతోబాటు పెండ్లాన్ని గూడా అలివిగాని కష్టపెట్టి పన్జేయిస్చాడని గాదూ సేద్దెగానికి పిల్లనియ్యంది..." ఆయన గొంతులో బాధ సుడులు దిరిగింది.

దుబ్బెంగటన్న ఇంకా ఏడుస్తూనే ఉన్నాడు.

జరుగుతున్న విషయాన్ని ఎలా విశ్లేషించుకోవాలో అర్థం కావటంలేదు.

కొడుకును నాగరీకునిగా మారిస్తేనన్నా పిల్లనిస్తారేమోనని ఎంతగా తాపత్రయ పడ్డాడనీ నర్సయ్య.

నాగరికత అంటే మోటార్‌బైకులో తిరగటం, స్మార్ట్ ఫోన్ చేతబట్టటం, టీ షర్ట్, ప్యాంటు తొడగటం, టీవీలు, మిక్సీలు సమకూర్చుకోవటం... ఇవేవీ కాదని పిస్తోంది జరిగిన సంఘటనల్ని పరిశీలిస్తే.

నర్సయ్యలాగే నేను కూడా ఇది నాగరికతకు సంబంధించిన సమస్యగానే భావించానుగాని శ్రమకు సంబంధించినదిగా ఊహించలేదు. 'శ్రమకు దూరం కావటమే నాగరికత,' అనే భావన జనాల్లో వ్యాపించిన విషయం పసిగట్టలేకపోయాను.

తర్వాత వారం రోజులకు నర్సయ్య నావద్దకొచ్చాడు.

"పిల్లోన్ని బెంగులూరు పంపిస్చాండ దొరా!" అన్నాడు.

'ఎందు'కన్నట్టుగా చూశాను.

"ఎద్దుల్ను అమ్ముతాండ. సేతి కింద ఎదిగొచ్చిన నాలుగు పొట్టేలు తగురుల్ను గూడా అమ్ముతాండ. వాడూ యీడూ యియ్యాల్సున్న లెక్క అడిగిపెట్టినా. సాలకుంటే

నీయట్టాంటి మారాజు కాడ అప్పు దీసుకొని అయినా వాన్ని బెంగులూరు పంపించాల.''

విషయమేమిటో చూచాయగా అర్థమవుతూ ఉంది.

''ముప్పయిమందికి సరిపోయే పి.జి. దొరికిందెంట. మా అల్లుని సుట్టమే మాట్లాడి పెట్టిండు,'' అంటూ తలొంచుకున్నాడు.

మా పల్లెల్లో దాదాపు సగానికి పైగా రైతు కుటుంబాలు బెంగళూరు, పూణె నగరాలకు వలస వెళ్లాయి. అక్కడ 'పేయింగ్ గెస్ట్' పేరిట హాస్టల్స్ తెరిచి ఒంటరి సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్ని, విద్యార్థుల్ని చేర్చుకొని నడుపుకొంటున్నారు. నెలకు పదో పాతికో మిగిల్తే, వ్యవసాయం కంటే మేలేగదా అని కాలం వెళ్లదీస్తున్నారు. కొందరేమో నష్టాలకు తట్టుకోలేక కన్నీళ్లతో ఇళ్లకు తిరిగి వస్తున్నారు.

ఓబులేసు బతకలేక బెంగుళూరు వెళ్లటంలేదు. పెళ్లికాక పోతున్నాడు. కష్టం చేతకాక వెళ్లటంలేదు. పెళ్లాన్ని కష్టపెట్టకుండా సాకగలననే భరోసా ఇచ్చేందుకు పోతున్నాడు. ఆడపిల్లల్ని సోమరులుగా సాకటం నాగరికతగా భావించే తండ్రుల కోసం పోతున్నాడు.

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*9 అక్టోబర్ 2016*

*




16 ఫిబ్రవరి 1963న కడప జిల్లాలో జన్మించారు. మొదటి కథ కడితి వేట 1987 ఆంధ్రపత్రికలో అచ్చయింది. దాదాపు వంద కథలు రాశారు. కొత్త దుప్పటి, బతుకు సేద్యం కథా సంపుటాలు, ఆరు నవలలు ప్రచురించారు. కొన్ని కవితలు అచ్చయ్యాయి. కాడి నవలకు ఆటా బహుమతి, ఒంటరి నవలకు 2017లో తానా బహుమతి లభించాయి.

**చిరునామా:** బాలరాజుపల్లె, నరసాపురం పోస్ట్ కాశినాయన మండలం,
కడప జిల్లా - 516 217

***ఫోన్: 94412 87865 sannapureddy12@gmail.com***